# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 137 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

29-03-2026 ఆదివారం వెల : 1/- పేజీలు : 4


## ప్రభుత్వం తీరు బాలేదు.. అభివృద్ధి లేదు..

# రైతుకు మద్దతు లేదు

-మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

- ధర్మాన సావిత్రమ్మ జ్ఞాపకార్థం బస్ షెల్టర్ ఏర్పాటు
- రామ చంద్రాపురంలో ప్రారంభించిన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- మొక్క జొన్న రైతులు రోడ్డున పడ్డారు.. పట్టించుకున్నారా అసలు
- ఆనాడే చెప్పాను..ఇప్పుడు మీ అందరికీ బోడి గుండు మిగిలింది

**నవతరం -గార**

మాజీ మంత్రివర్యులు ధర్మాన ప్రసాదరావు తన మాతృమూర్తి సావిత్రమ్మ జ్ఞాపకార్థం రామచంద్రాపురంలో బస్ షెల్టర్ నిర్మించి, ఇవాళ (శనివారం) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన తల్లి స్మరణార్థం ఏర్పాటు చేసిన ఈ బస్ షెల్టర్ ను అంతా వినియోగించుకోవాలని కోరారు. బస్ షెల్టర్ నిర్మాణం పూర్తై వినియోగంలోకి వచ్చింది, అందరికీ అందుబాటులోకి తీసుకు వచ్చాం. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగి ఐదేళ్ల కాలం పూర్తయింది, అందరిని అభినందులు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాము.
అభివృద్ధి అనేది రెండు రకాలు భౌతికంగా కనిపించేది రోడ్లు, భవనాలు. కనిపించిన వాటికి పంచాయతీ లెవెల్ లో చేయాలి. అంటు రోగాలు రాకుండా చూడాలి. మూఢ నమ్మకాల వైపు ప్రజలు వెళ్లకుండా చూడాలి. అందరిని చదివించాలి. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలి ఇది కూడా అభివృద్ధి. ఇవాళ గ్రామాల్లో పిల్లలు ఆరోగ్యంగా కనిపించడంలేదు. కల్తీ ఆహారాలు ప్రభావం, పోషకాలు ఉండే ఆహారం అందించాలి. అవి పిల్లలను చిదిమేస్తున్నాయి. ప్రతి తల్లి చైతన్యంగా ఉండాలి. ప్రతినిధులు ఆదర్శంగా ఉంటూ, అభివృద్ధి వైపు సూచనలు చేస్తూ ఉండాలి.
వ్యవసాయం కొత్త కొత్త సమస్యలు వస్తున్నాయి. ఎరువులు దొరకడం పెద్ద సమస్యగా ఉంది.

-మిగతా 2లో





# నారాయణాచార్యులు కవి, బహుబాషావేత్త


జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరావు



**నవతరం -శ్రీకాకుళం**

నారాయణాచార్యులు కవి, బహు బాషావేత్తని జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరావు వెల్లడించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పుట్టపర్తి నారాయణాచార్యులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి నారాయణాచార్యులు 1914, మార్చి 28న జన్మించిన ఒక ప్రఖ్యాత తెలుగు పండితుడు, కవి, బహుభాషావేత్తని కొనియాడారు. తెలుగు సాహిత్యానికి, ప్రాచీన అధ్యయనాలకు ఆయన చేసిన అపారమైన సేవలకు గౌరవసూచకంగా ప్రతి సంవత్సరం మార్చి 28న ఆయన జయంతిని జరుపుకుంటున్నట్లు వివరించారు. ఆయన బహుభాషలపై తనకున్న పట్టుకు, అలాగే తన రచనల ద్వారా భారతీయ సంస్కృతి, తత్వశాస్త్రం, సాహిత్య వారసత్వాన్ని ప్రోత్సహించినందుకు ప్రసిద్ధి చెందినట్లు పేర్కొన్నారు. ఆయన రచనలు గాఢమైన పాండిత్యాన్ని, కవితా నైపుణ్యాన్ని, సాంప్రదాయ విలువలను పరిరక్షించాలనే బలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తాయన్నారు.
పుట్టపర్తి నారాయణాచార్యులు జయంతి సందర్భంగా, సాహిత్య, సాంస్కృతిక సంస్థలు తెలుగు సాహిత్యంలో ఆయన వారసత్వాన్ని చాటిచెప్పే సదస్సులు.
కవితా పఠనాలు, చర్చల ద్వారా నివాళు లర్పిస్తాయన్నారు.
ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ, సెట్ శ్రీ సిఇఓ అప్పలనాయుడు, పర్యాటక అధికారి నారాయణరావు, సి సెక్షన్ పర్యవేక్షకులు రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత: కలెక్టర్



**నవతరం -ఆమదాలవలస**

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అక్కులపేట, దూసి, తొగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిశుభ్రత లోపాలపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బయోమెడికల్ వ్యర్థాలను వేరు చేసి సరైన విధంగా నిర్వహించాలని ఆదేశించారు. తొగరం స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని కూడా సందర్శించి శుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, వ్యర్థాల రీసైక్లింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కె. అనిత తదితరులు పాల్గొన్నారు.

# మూలపేట పోర్టుకు పోదాం పదండి కార్యక్రమం విజయవంతం చేయండి

వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు పిలుపు

**నవతరం -పలాస**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న గాని, ఇంతవరకు రాష్ట్ర అభివృద్ధికి శాశ్వతమైన ఒక్క అభివృద్ధి కార్యక్రమం గానీ, ప్రజా సంక్షేమానికి ఒక్క సంక్షేమ పథకం గాని చేపట్టక పోగా, గత వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తామే చేసేమంటూ కూటమి ప్రభుత్వం పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తో సహా క్రెడిట్ చోరీకి పాల్పడుతున్న తీరు చూస్తే హాస్యాస్పదంగా ఉందని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. శనివారం పలాసలో ఆయన

-మిగతా 2లో

# ఈ సన్మానం మన స్వాస్ సేవా సంఘం కుటుంబ సభ్యులందరిది

స్వాస్ సేవా సంఘం అధ్యక్షులు బుర్లె. పైడినాయుడు



**నవతరం -శ్రీకాకుళం**

మాతృభూమి సేవ సంఘం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా విజయనగరం కేఎల్ పురం యూత్ హాస్టల్ లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం అలాగే స్వచ్ఛంద సేవకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పౌర వేదిక అధ్యక్షులు భిశెట్టి బాబ్జి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వాస్ సేవా సంఘం సేవలకు గాను స్వాస్ సంఘం సంఘం అధ్యక్షుడు

-మిగతా 2లో

# అరసవల్లిలో సుగంధ ద్రవ్య మర్దన ఉత్సవం నిర్వహణ

**నవతరం -శ్రీకాకుళం**

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో చైత్ర శుద్ధ దశమి సందర్భంగా శనివారం సాయంత్రం సుగంధ ద్రవ్య మర్దన (కోట్నం దంపు) ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు ఆలయ అనివెట్టి మండపంలో జరిగిన ఈ కార్యక్రమం సాంప్రదాయ కీర్తనల నడుమ భక్తిశ్రద్ధలతో సాగింది.
ఈ ఉత్సవంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, కార్యనిర్వహణాధికారి కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్ పాల్గొన్నారు.



ఎడిటోరియల్

# ఏడెన్ జలసంధికి పోరు విస్తరణ !

అమెరికా-ఇజ్రాయిల్ ప్రారంభించిన ఏకపక్ష దాడులు, వాటికి ఇరాన్ ప్రతిఘటన నేటితో 28వ రోజులో ప్రవేశించింది. ట్రంప్ ముందే చెప్పినట్లు నాలుగు లేదా ఐదు వారాలు దాడులు కొనసాగించటం, సాధ్యమైన మేరకు ఇరాన్‌కు నష్టం కలిగించే దుష్ట ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నిదాడులు చేసినా ఇరాన్ తగ్గటం లేదు. అనూహ్యరీతిలో ఎదురుదాడులు చేస్తోంది. దాంతో దిక్కుతోచక ఓటమిని అంగీకరిస్తూ తమతో ఒప్పందానికి రావాలని, లేకపోతే చివరిగా భీకరదాడులు చేస్తామని ట్రంప్ యంత్రాంగం బెదిరింపులకు దిగుతోంది. తమ ఆయువుపట్టు మీద జరుపుతున్న దాడులకు ప్రతిగా తాము ఇజ్రాయిల్ అణు మౌలిక సదుపాయాల వ్యవస్థమీద దాడి చేసినట్లు రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించారు. హోర్ముజ్ జలసంధి మీద అదుపు సాధించేందుకు నాలుగు అవకాశాలను అమెరికా పరిశీలిస్తోంది.
ఒకటి చమురు కేంద్రం ఖార్గ్ దీవి ఆక్రమణ, జలసంధిని అదుపు చేసే కేంద్రం, బంకర్లు ఉన్న లారక్ దీవిపై దాడి, జలసంధికి పశ్చిమ మార్గంగా ఉన్న రెండు దీవుల ఆక్రమణ, నాలుగవది ఇరాన్ నౌకల దిగ్బంధం. ఇందుకోసం ఐదువేల మంది మెరైన్, వెయ్యి మంది వైమానిక కమాండర్లను దించి ఇరాన్ దీవులను పట్టుకొనేందుకు అమెరికా పూనుకుంది.దానికి ప్రతిచర్యలకు ఇరాన్ పాల్పడు తోంది. భూతల దాడులు, ఇరాన్ ఆక్రమణ గురించి కూడా ఆలోచిస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ పరిణామాలతో గురువారం నాడు మరోసారి ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు బ్రెంట్ రకం 105 డాలర్లు దాటింది. ఇంధన మౌలిక సదుపాయాలపై ఐదు రోజుల పాటు దాడులు నిలిపివేస్తానని ట్రంప్ చేసిన ప్రకటన అదనపు బలగాలను రప్పించేందుకు వేసిన ఎత్తుగడ అన్నది తేలిపోయింది. తమ దీవుల మీద దాడిచేస్తే హర్ముజ్ జలసంధిలో మందుపాతరలు పెట్టి పేల్చివేస్తామని, రక్తపుటేరులు పారిస్తామని టెహరాన్ ప్రకటించింది.
అంతేకాదు, ప్రపంచ చమురురవాణాలో పదిశాతం నౌకలు ప్రయాణించే బాబ్ అల్ మండాబ్ జలసంధిని కూడా దిగ్బంధనం చేస్తామని అందుకు గాను ఎమెన్‌లో ఉన్న తమ అనుయాయులు సిద్ధంగా ఉన్నట్లు కూడా స్పష్టం చేసింది. అక్కడి నుంచే ఏడెన్ జలసంధి ప్రారంభమవుతుంది. అదే జరిగితే ఈజిప్టులోని సూయజ్ కాలువ బదులు ఆఫ్రికాలోని గుడ్‌హోప్ అగ్రం చుట్టూ నౌకలు తిరిగి రావాల్సి ఉంటుంది. మధ్యధరా సముద్రంతో ఎర్ర సముద్రాన్ని అనుసంధానిస్తూ తవ్విందే సూయజ్ కాలువ. ఐరోపా, ఇతర ఖండాల నుంచి వచ్చే నౌకలు ఎర్ర సముద్రం నుంచి ఏడెన్ గల్ఫ్ ద్వారా హిందూ మహా సముద్ర ప్రాంతమైన అరేబియా సముద్రంలో ప్రవేశిస్తాయి.
గతంలో గాజాపై ఇజ్రాయిల్ దాడులు చేసినపుడు ఎమెన్‌లోని హౌతీ సాయుధ దళాలు ఇజ్రాయిల్ తీరానికి వెళ్లేందుకు ఆ ప్రాంతానికి వచ్చిన కొన్ని నౌకల మీద దాడులు చేసి ముంచివేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అంతకంటే తీవ్ర స్థాయిలో చర్యలుండే అవకాశముంది.
అమెరికా-ఇజ్రాయిల్‌ను అదుపు చేయటంలో ఐరాస విఫలమైంది. భారత్ వంటి దేశాలు వత్తిడి తెచ్చేందుకు పూనుకోకపోవటంతో తమకు ఎదురులేదన్నట్లుగా ట్రంప్-నెతన్యాహు రెచ్చిపోతున్నారు. ఉన్మాదంతో వ్యవహరిస్తున్న తమ శత్రువును అదుపులో ఉంచేందుకు బాబ్ అల్ మండాబ్ జలసంధిని కూడా మూసివేయక తప్పదని ఇరాన్ ప్రకటించింది. ఈ జలసంధి ఇరుకుగా ఉంటుంది, వెడల్పు 29 కిలోమీటర్లు మాత్రమే. దాడులు చేయటం సులభం.ఈ జలసంధి ద్వారా జరిగే ముడి చమురు, ఉప ఉత్పత్తుల రవాణాలో అరవై శాతం ఐరోపా, అమెరికా దేశాలకు, మిగిలింది ఆసియాకు జరుగుతోంది.
అందువలన దీన్ని ఆటంకపరిస్తే సెగ అందరికీ తగులుతుంది. రాజధాని సనాతో సహా ఎమెన్‌లో కీలకమైన ప్రాంతాన్ని ఇరాన్ అనుకూల హౌతీ దళాలు అదుపు చేస్తున్నాయి. హర్ముజ్ జలసంధిని మూసివేస్తామన్న ఇరాన్ అన్ని హద్దులను దాటుతున్నదని గల్ఫ్ సహకార మండలి(జిసిసి)మండిపడింది. ఇన్ని రోజుల తర్వాత ఈ ప్రకటన వెనుక కచ్చితంగా అమెరికా వత్తిడి ఉందన్నది స్పష్టం. అయితే అన్యాయంగా అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్నదాడుల గురించి మౌనం దాల్చటం గర్హనీయం, అమెరికాకు లొంగిపోవటం తప్ప మరొకటి కాదు. తమ దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలు నెలకొల్పు కొనేందుకు అవకాశమివ్వటం ఆ దేశాలు చేసిన చారిత్రక తప్పిదం.
అక్కడి నుంచి తమ మీద దాడులు జరుపుతుంటే ఏదేశమైనా సహిస్తుందా? దాడులపాలని అమెరికా- ఇజ్రాయిల్ మీద వత్తిడి తేవాల్సిన జిసిసి ఇరాన్‌కు హెచ్చరికలు చేస్తే ఉపయోగం ఉండదు.ఈ కూటమి బలహీనతలను ఆధారంగా చేసుకొని అమెరికా తెగబడుతోంది. దాన్ని నమ్ముకొని ఇరాన్‌పై దాడుల్లో భాగస్వాములైతే అంతకన్నా తప్పిదం వేరే ఉండదు. తమకు అమెరికా శత్రువు తప్ప గల్ఫ్ దేశాలు కాదని కొద్ది రోజుల క్రితమే టెహరాన్ స్పష్టం చేసింది. అందువలన తమ పలుకుబడిని ఉపయోగించి ఇతర దేశాలను కూడా అమెరికా మీద వత్తిడి తెస్తేనే తమకూ, ప్రపంచానికి ప్రయోజనమని అవి గుర్తించాలి. ఇరాన్ హెచ్చరించినట్లుగా బాబ్ అల్ మండాబ్ జలసంధి సంక్షోభంలోకి వెళితే దానికి పూర్తి బాధ్యత అమెరికా- ఇజ్రాయిల్‌దే. వాటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతిస్తున్న దేశాలదేనని చెప్పక తప్పదు.

# మూలపేట పోర్ట్‌కు పోదాం పదండి కార్యక్రమం విజయవంతం చేయండి

మొదటిపేజీ తరువాయి

మీడియాతో మాట్లాడుతూ,ఏపీ అభివృద్ధికి అవకాశం కల్పించే అంశాలలో తీర ప్రాంతం ప్రధానమని, దానిని ఆర్థిక వనరుగా మార్చుకోవాలని ఆలోచన తో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2008 జూలై 17న కృష్ణపట్నం పోర్టు ప్రారంభించారని, ఆ తర్వాత చంద్రబాబు హయాంలో రామాయ పట్నం, బందరు పోర్టులకు శంకుస్థాపన చేసినప్పటికీ, నిర్మాణ పనులు జరగలేదన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఒకేసారి మూడు కొత్త పోర్టులు, నిర్మాణంలో నిలిచిన మరొక పోర్టు తోపాటు 10 ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. వీటితో రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య విస్తరణకు పునాదులు పడ్డాయని బమ్మిడి దుర్యోధనరావు గుర్తు చేశారు. అందులో భాగంగా వైయస్ఆర్సీపీ ప్రభుత్వం లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సుమారు రూ. 4362 కోట వ్యయశీ తో మూలపేట పోర్టు నిర్మాణాన్ని ప్రారంభించి, 70 శాతం పనులు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.
వాడరేవుల నిర్మాణమే కాక మత్స్యకారుల జీవనోపాధిని పెంపొందించేందుకు కొత్తగా పది ఫిషింగ్ హార్బర్లు మంజూరు చేసి, నిర్మాణాలు కొన్ని చేపట్టారని, ఇంతలో ఎన్నికల కోడ్ రావడం వల్ల హార్బర్ నిలిచిపోయాయని బమ్మిడి దుర్యోధనరావు పేర్కొన్నారు. పోర్టులు నిర్మాణం అయితే వాటిని పారిశ్రామిక కారిడార్లతో అనుసంధానం చేయడం, పారిశ్రామిక అభివృద్ధి, స్థానిక యువతకు ఉద్యోగ , ఉపాధి కల్పన, మరియు ఎగుమతుల పెంపు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. వైయస్ జగన్ హయాంలో చేపట్టిన పోర్టుల నిర్మాణ పనుల వల్ల జగనన్నకు పేరు వస్తుందనే దురుద్దేశంతో చంద్రబాబు తన ప్రభుత్వంలోనే పోర్టుల అభివృద్ధి చేస్తున్నామంటూ , క్రెడిట్ చోరీకి పాల్పడుతున్న తీరు రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని బమ్మిడి దుర్యోధనరావు తెలిపారు. గతంలో హైదరాబాద్ నేనే అభివృద్ధి చేశానని, ఐటీ రంగాన్ని నేనే తెచ్చానని, హైదరాబాద్ రింగ్ రోడ్డు తానే అభివృద్ధి చేశానని, భోగాపురం ఎయిర్ పోర్ట్ నేనే నిర్మించాను అంటూ క్రెడిట్ చోరీకి పాల్పడడం చంద్రబాబు నాయుడుతో పాటు తెలుగుదేశం పార్టీ పెద్దలకు ఒక రివాజుగా మారిందని ఆయన ఆరోపించారు. రైతులు, డ్వాక్రా మహిళలు, యువత, అసంఘటిత కార్మికులు, నిరుపేద విద్యార్థులు తదితరులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందన్నారు.
ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాల కంటే కార్పొరేట్లకు, కూటమి ప్రభుత్వ పెద్దలు, నేతల ప్రయోజనాలకే లబ్ధి చేకూరింది తప్ప, సామాన్యులకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. కేవలం రెడ్ బుక్ రాజ్యాంగం తోనే కాలక్షేపం చేస్తున్న కూటమి ప్రభుత్వం ఆచరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు బుద్ధి చెప్పేందుకు వైయస్ఆర్సీపీ ప్రజలు తరఫున రాజీలేని పోరాటాలు చేస్తుందని, నిత్యం ప్రజలతో మమేకమవుతూ, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను ఎండగడుతూ, రాష్ట్ర ప్రజలను చైతన్య పరుస్తూ, ఉద్యమిస్తుందన్నారు. ఈ సందర్భంగా మూలపేట పోర్టుపై క్రెడిట్ చోరీకి పాల్పడుతున్న టిడిపికి చెందిన కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రి తోపాటు ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు, ఈనెల 30వ తేదీన సంతబొమ్మాళి మండలం మూలపేట సమీపంలో ' పోర్టుకు పోదాం పద ' అనే కార్యక్రమం వైఎస్ఆర్సిపి అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు వైసీపీ శ్రేణులు విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రులు ధర్మాన ప్రసాద్ రావు, రాష్ట్ర మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, వైయస్సార్సీపి శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్, రాష్ట్ర నేతలు, జిల్లాలో అన్ని నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు పాల్గొంటారని బమ్మిడి దుర్యోధనరావు స్పష్టం చేశారు.

# ఈ సన్మానం మన స్వాస్ సేవా సంఘం కుటుంబ సభ్యులందరిది

మొదటిపేజీ తరువాయి

బుర్లె.పైడినాయుడు నీ దుస్సాలువాతో అతిధులు చేతుల మీదగా సన్మానించి, స్వా సేవా సంఘం సేవలు అద్భుతమని కొనియాడారు.ఈ సందర్భంలో స్వాస్ సంఘం సంఘం అధ్యక్షుడు బుర్లె.పైడినాయుడు మాట్లాడుతూ ఈ సన్మానం మన స్వాస్ సేవా సంఘం కుటుంబ సభ్యులందరిది అని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల వైపు అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ చీఫ్ పిడుగులు ప్రభాకర్ రావు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి కృష్ణమూర్తి నాయుడు, ఏపీ అబ్దుల్ కలాం ఫౌండేషన్ మమ్ముల తిరుపతిరావు, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపి, అధ్యక్షులు పోన్నడ కనకాచారి, ఎన్ వి ఎన్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, హ్యూమన్ రైట్స్ సంతోష్, కరాటి అశ్విని, విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇక్తమస్, పోలీస్ డిఫెన్స్ అకాడమీ అనిల్ కుమార్, సాధన యువజన సంఘం దుర్గాప్రసాద్, ఫుడ్ విజిలెన్స్ పద్మలత, నవజీవన్ ట్రస్ట్ చిన్నమ్మలు, ఎస్ పి యూత్ సొసైటీ అధ్యక్షురాలు ప్రవల్లిక, అన్నదాత సుఖీభవ కాంచన, జయమ్మ, గ్రామీణ వైద్యులు నగేష్, సురేంద్ర,జ్ఞానేశ్వర్రావు, గర్భం ఈశ్వరరావు, కాపు సంఘం రాజారావు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వం తీరు బాలేదు.. అభివృద్ధి లేదు.. రైతుకు మద్దతు లేదు

మొదటిపేజీ తరువాయి

2400 మద్దతు ధర ప్రభుత్వం జొన్నలకు కేటాయిస్తే, 1400 రూపాయలకు మార్కెట్లో అమ్ముడు పోతుంది. మద్దతు ధరకు అర్థం ఏంటి. జొన్న పంట వేసినప్పుడు ఎరువు ఇవ్వలేని ప్రభుత్వం మద్దతు ధర కూడా ఇవ్వకపోతే, రైతులు ఎంత నష్టపోతున్నారు. ఈ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా పని చేస్తోంది. అన్ని ధరలూ పడిపోయాయి. ప్రభుత్వం కనీస మద్దతు ధర అందించేందుకు ప్రయత్నం చేయడం లేదు. ఇవాళ మార్కెట్ లో సిలిండర్ ధర 2000 కి అమ్ముతున్నారు. ఈ ప్రభుత్వం కళ్ళు ఉన్నా చూడలేకపోతోంది. కబోదిలా ఉంది. అన్ని ధరలు ఇష్టం వచ్చినట్టు పెరిగిపోయాయి. రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..? ఆ రోజు ఎన్నికల నాడే చెప్పాను..ఇప్పుడు బోడి గుండు మిగిలింది. మంచి ప్రభుత్వం అని స్టికర్ మాత్రమే అంటిస్తారు. ప్రజల సమస్య కన్నా రాజధాని నిర్మాణమే చంద్రబాబుకు ముఖ్యం. ఆ రోజు కరోనా సమయంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఎంత పద్ధతిగా ఆదుకుందో అందరూ చూశారు. ప్రభుత్వం అంటే అలా ఉండాలి. ప్రజలు ఇబ్బందులు పట్టించుకోని ప్రభుత్వాలు ఉంటే ఎంత..లేకపోతే ఎంత ? ఈ ఐదేళ్లూ ప్రజలను పీక్కు తింటారు వీళ్లు. కనుక ప్రజలు వాస్తవాలు గ్రహించి రానున్న కాలంలో మేలు చేసే నాయకులనే ఎన్నుకోవాలి. పీక్కు తినే నాయకులను వదిలించుకోవాలి. ప్రజా సమస్యలపై పోరాడే విపక్షాలతో కలిసి పనిచేయాల్సిన తరుణం ఇది. రానున్న కాలంలో స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం ఏ మేరకు కృషి చేస్తుంది అన్నది అనుమానమే. స్థానిక సంస్థలలో ఎటువంటి అక్రమాలకూ అధికార పార్టీ తావివ్వకుండా.. కార్యకర్తలూ నాయకులూ అప్రమత్తమై పనిచేయాలి అని ధర్మాన పేర్కొన్నారు.

# పట్టణంలో పోలీసుల కార్డెన్ సెర్చ్.. తనిఖీలు


**నవతరం -పాలకొండ**

మరియు మాదకద్రవ్యాల నియంత్రణే ధ్యేయంగా పోలీసులు శనివారం ఉదయం పాలకొండలోని కస్పా వీధిలో పోలీసులు ముమ్మరంగా కార్డెన్ సెర్చ్ చేపట్టారు. స్థానిక డీఎస్పీ రాంబాబు పర్యవేక్షణలో ఈ మెగా కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు సీఐ ఏ.ప్రసాదరావు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెనుముప్పుగా మారిన మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. యువత చెడు మార్గాల వైపు



మళ్లకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

# మహేంద్రతనయ-బాహుదాను అనుసంధానం చేయాలి



డాక్టర్ సీపాన గుణవతి

**నవతరం -సోంపేట**

రైతుల సాగునీటి అవసరాల దృష్ట్యా వంశధార నదిని మహేంద్రతనయ, బాహుదా నదులను అనుసంధానం చేస్తే పలాస సబ్‌డివిజన్‌లోని లక్షల ఎకరాల భూములకు సాగునీటి సౌకర్యం లభిస్తుందని, ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కృషిచేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ డాక్టర్ సీపాన గుణవతి అన్నారు. సోంపేటలో శనివారం నిర్వహించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ, లాభసాటి పంటల వైపు రైతులు మొగ్గుచూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను రక్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కోరారు. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలు, మేధావులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టు డోల శంకర్‌పై జరిగిన దాడిని ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. జర్నలిస్టులు తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే కానీ, భౌతిక దాడులు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సభ్యులు స్పష్టంచేశారు. ఇచ్ఛాపురం మండలానికి సంబంధించిన పలు సమస్యలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి జిల్లా అడ్వయిజర్ లోకినంది గోవిందరాజులు, పలాస సబ్‌డివిజినల్ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టా పోలయ్య అధ్యక్షత వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రవి కుమార్, కార్యదర్శి విశ్వ ప్రభాకరరావు, పలాస సబ్‌డివిజినల్ కార్యదర్శి లొట్ల కృష్ణమూర్తి, మురళి, ఇచ్ఛాపురం మండల కన్వీనర్ సాలిన ఢిల్లీ రావు తదితరులు పాల్గొన్నారు.
జాతీయ బీసీ సంక్షేమ సంఘంలో కొత్తగా నియమితులైన సభ్యులను ఈ సందర్భంగా ప్రకటించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్. గుణప్రసాద్, పలాస సబ్‌డివిజనల్ లీగల్ అడ్వయిజర్‌గా ఎస్. నాగేశ్వరరావు, సోంపేట మండల కన్వీనర్‌గా కె. ప్రసాద్, కార్యదర్శిగా ఈరోతు శ్రీనివాసరావు, కోస్టల్ కన్వీనర్‌గా గోరఖ ఢిల్లీరావు, ఉపాధ్యక్షుడిగా బదే రాజేష్, కార్యదర్శిగా సునీల్ కుమార్, సోంపేట అర్బన్ కన్వీనర్‌గా ఎస్. జానకిరావు, మహిళా వైస్ ప్రెసిడెంట్‌గా దుగాన మమత, ఇచ్ఛాపురం మహిళా కన్వీనర్‌గా సాలిన పద్మ, కార్యదర్శిగా సుమిత నియమితులయ్యారని డా. సీపాన గుణవతి తెలిపారు.

# వెలుగొండ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రకాశం జిల్లా



తిరుమల కొండకు ప్రతిరూపమైన పుణ్య క్షేత్రం వెలుగొండ. పూర్వం ఇక్కడి నుంచి తిరుమలకు ఓ కొండదారి ఉండేదని ప్రచారం. ఈ మార్గంలోనే కలియుగ వైకుంఠానికి రాక పోకలు జరిగేవంటారు. ఆదిశేషుని ఆకారంలోని ఆ పర్వతశ్రేణికి తలభాగంలో సప్తగిరీశుడు వెలిస్తే... తోకభాగంలో వెలుగొండస్వామి కొలువయ్యాడని పారవశ్యంతో చెప్పుకుంటారు. భక్తులు. ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలంలోని గార్లదిన్నె పంచాయతీ పరిధిలో ఉందీ క్షేత్రం.

## పౌరాణిక చరిత్ర

కాలయవనుడు మహా దుర్మార్గుడు. మహర్షులకు తపోభంగం కలిగిస్తుంటాడు. సామాన్యులను తీవ్రంగా హింసిస్తుంటాడు. ఆ లోకకంటకుడిని ఏం చేయాలో తోచక, కృష్ణపరమాత్ముడు ముచికుంద మహర్షిని ఆశ్రయిస్తాడు. ముచికుందుడు ఇక్ష్వాకు వంశానికి చెందిన మాంధాత తనయుడు. నిద్రాహారాలు మాని, సురాసుర యుద్ధంలో దేవతలకు సాయంగా నిలుస్తాడు. తన పని పూర్తయ్యాక.. కంటినిండా నిద్రపోయే వరాన్నివ్వమని అడుగుతాడు. శ్రీకృష్ణపరమాత్మ దర్శనంతో మోక్షాన్ని పొందుతావని దేవతలు మాటిస్తారు. అప్పటిదాకా ఓ గుహలో హాయిగా నిద్రపోతుంటాడు. ఓసారి, ధైర్యం ఉంటే, నాతో యుద్ధాకి రమ్మంటూ' కృష్ణుడిని ఉసిగొల్పుతాడు కాలయవనుడు. కృష్ణుడు పారిపోతున్నట్టుగా నటిస్తూ... కొండలు దాటి, గుట్టలు దాటి, ఆ రాక్షసుడిని ఓ చీకటి గుహలోకి తీసు కెళ్తాడు. అది ముచికుందుడు నిద్రపోతున్న ప్రాంతం. చీకట్లో నిద్రిస్తున్న మహర్షిని చూసి... కృష్ణుడేమో అనుకుని కాలితో తన్నేస్తాడు కాలయవనుడు. అంతే, మహర్షికి నిద్రాభంగమైపోతుంది. ఆ నేత్రాగ్నికి భస్మమై పోతాడు రాక్షసుడు. ఆ ఉదంతమంతా వెలుగొండమీదే జరిగిందని స్థల పురాణం. ఇక్కడ, ముచికుంద మహర్షి విగ్రహం కూడా ఉంది. మహర్షి కోరిక మేరకే కృష్ణుడు ... తిరువేంగళనాథస్వామిగా వెలిశాడంటారు.



## చరిత్ర

విజయనగర ప్రభువు కృష్ణదేవరాయలు తిరుమల నుంచి శ్రీశైలం వెళుతూ మార్గ మధ్యంలో వెలుగొండ ఆలయాన్ని దర్శిం చాడు. భక్తితో పూజలు చేసి, స్వామివారి నిత్య నైవేద్య దీపారాధనలకు భూరివిరాళాలు ఇచ్చినట్టు రాయలవారి దాన శాసనం చెబు తోంది. ఆలయ ఆవరణలోని హనుమంతుని విగ్రహం దగ్గరున్న ఓ శాసనం ప్రకారం క్రీ.శ. 1447-48 సంవత్సరం నిమ్మంజహేతిం గారనే పెద్దమనిషి హనుమంత పెరుమాళ్లను ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. ఇక్కడే ఓ శివ లింగం కూడా ఉంది. ఈశ్వరుడు తూర్పు ముఖంగా ఉంటాడు. వేంకటేశ్వరస్వామి ఉత్తర ముఖంగా భక్తులకు దర్శనం ఇస్తాడు. శివకేశవులిద్దరూ ఒకే ప్రాకారంలో కొలువై ఉండటం ఇక్కడి విశేషం. లక్ష్మీదేవి గర్భగుడి లోని సొరంగ మార్గం ద్వారా కొండపైకి చేరి నట్టు ఓ ఐతిహ్యం. కొండ పైనున్న లక్ష్మమ్మ ఆలయానికి కూడా ఎంతో ప్రశస్తి ఉంది.

ఈ క్షేత్రం మూసినది ఉద్భవించిన పవిత్ర ప్రాంతం. స్వామి వారి పాదాల చెంత నుంచే నది ప్రవహిస్తుంది. ఇక్కడే, మహర్షి తపస్సు చేయడంతో ముచికుంద నదిగా 'పేరు స్థిరపడింది. కాలక్రమంలో అది ముసి నదిగా మారింది. పొదిలి, దర్శి, కందుకూరు, ఒంగోలు ప్రాంతాల్ని దాటుకుని వెళ్లి, సముద్రంలో కలుస్తుందీ నది. కొండకు కొద్ది దూరంలోని బండరాతిలో లక్ష్మమ్మ దోన, నిచ్చెనల దోనలు ఉన్నాయి. మండు వేసవిలోనూ వాటిలో నీరు ఉంటుంది. అమ్మవారు ఈ దోనలలో స్నానం చేసినట్టు ప్రతీతి.

'తాడివారి మర్యాద' అన్నమాట ప్రకాశం జిల్లాలో బాగా ప్రచారంలో ఉంది. అదేదో రాచమర్యాద లాంటిదని భ్రమ పడుతుంటారు చాలామంది. శ్రీవారు చెంచులక్ష్మిని పెళ్లి చేసు కోవటంతో, ఆగ్రహించిన లక్ష్మీదేవి బందువు లైన తాడివారిపల్లెవాసులు కత్తులూ కటార్లతో స్వామివారిపై దాడిచేశారని ఓ కథ. ఇదే 'తాడివారి మర్యాద' అంటే! ఈ సంప్రదాయం బ్రహ్మోత్సవాల్లోనూ కొనసాగుతోంది. తాడివారిపల్లె జనం ఆయుధాలతో వచ్చి... ప్రత్యేక పూజలు నిర్వహించి వెళ్లడం ఆన వాయితీ. ఏడుకొండల దాకా వెళ్లలేని భక్తులు వెలుగొండను ఎక్కిన చాలా అనుకుంటారు తిరుమలేశు ని కళ్ళారా చూడలేకపోయిన లోటును తిరువెంగళనాథ స్వామి దర్శనం ద్వారా తీర్చుకుంటారు.

జాతీయ రహదారి నుంచి కేవలం ఐదు కిలోమీటర్లు ఉంటుంది మార్కాపురం నుంచి గాని కొనకండి వస్తున్నప్పుడు నాగిరెడ్డిపల్లి గ్రామం వస్తుంది అక్కడినుంచి వెలిగొండ వెంకటేశ్వర స్వామి క్షేత్రానికి ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది 28 కిలోమీటర్ల దూరం ఉంది కొనకమిట్ల నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

మరో మార్గంలో...

వెలుగొండ వెంకటేశ్వర స్వామి ఆలయం మార్కాపురం ఒంగోలు మార్గంలో నాగిరెడ్డిపల్లె నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది ఒంగోలు- కర్నూలు మార్గంలోని చినమనగుండం నుంచి అయితే 7 కిలోమీటర్లు మార్కాపురం నుంచి ఆలయ ముఖద్వారం పక్కగా గొట్లగట్టు వరకు బస్సు ఆటో సౌకర్యం ఉంది.

## మంచి మాట జ్ఞానదీపం

జ్ఞాన దీపానికి కావల్సిన తైలం నిర్మలమైన మనస్సు నుండి పుట్టిన భక్తి. జ్వాలకు అవసరమయ్యే ప్రాణ వాయువు భగవంతుని కోసమైపడే తీవ్రమైన తపన. నిగ్రహం, మృదుస్వభావం, పరుషంగా మాట్లాడకపోవటం, అసూయలేక పోవడం, క్రమశిక్షణతో వుండటం ఇవి జ్ఞానోదయం అనే వత్తికి చిహ్నాలు. దీపం నిలబడటానికి ఆధారమైన ధ్వజం లేదా స్తభం అంతఃకరణానికి గుర్తు, ఆశాద్వేషాలు మనస్సును ఆవరిం చకుండా, అవాంఛ కలుగజేయడానికి దీపానికిగల పైకప్పు గుర్తు. భగవంతునిపై ధ్యానాన్ని నిల్పడానికి కావల్సిన జాగ్రదావస్థకు దీపంనుండి జనించే ప్రకాశం చిహ్నం.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# పరమ బోరింగ్

**మూవీ రివ్యూ: బ్యాండ్ మేళం**
**చిత్రం: బ్యాండ్ మేళం**
**రేటింగ్: 1.5/5**
**తారాగణం: హర్ష్ రోషన్, శ్రీదేవి, సాయికుమార్ తదితరులు**
**స్క్రీన్ ప్లే- ఎడిటింగ్: శివ ముప్పరాజు**
**సంగీతం: విజయ్ బుల్గానిన్**
**నిర్మాతలు: కావ్య, శ్రావ్య**
**బ్యానర్: కోనా ఫిల్మ్ కార్పొరేషన్**
**రచన- దర్శకత్వం: సతీష్ జవ్వాజి**
**విడుదల: మార్చి 26, 2026**

గత ఏడాది చిన్న సినిమా "కోర్ట్" సూపర్ హిట్ కావడంతో పాపులర్ అయిన జంట హర్ష్ రోషన్- శ్రీదేవి. ఆ ఇద్దరి కాంబినేషన్లో వచ్చిన ఈ చిత్రం నిర్మాత కోన వెంకట్ కారణంగా కాస్తంత ప్రచారం జరుపుకుంది. ఇంతకీ ఎలా ఉందో చూద్దాం.

గిరి (హర్ష్ రోషన్) స్కూల్లో ఫైల్యూర్ స్టూడెంట్. రాజి (శ్రీదేవి) గిరికి మరదలు. ఆమె మాత్రం టాప్ ర్యాంకర్. గిరికి ఆమె అంటే ప్రాణం. గిరికి పాటలు కంపోజ్ చేసి పాడడమంటే ఇష్టం. "అల్లరి ప్రియుడు" లో రాజశేఖర్ టైపులో ఒక సొంత బ్యాండ్ ట్రూప్ తో పల్లెటూరి పెళ్లిళ్లల్లో పాటలు అవీ పాడుతుంటాడు. ఎప్పటికైనా రెహ్మాన్ అంత పెద్ద సంగీత దర్శకుడు కావాలని అతని కల. ఇదిలా ఉంటే మరదలు మాత్రం తన ఇంజనీరింగ్ కాలేజ్ మేట్ తో లేచిపోతుంది. అతను మోసం చేశాడని వెనక్కి వచ్చేస్తుంది. అప్పుడు గిరి ఆమెను ఒప్పుకుంటాడా అనేది కథ. పాయింట్ గా చూస్తే ఓకే అనిపిస్తుంది. కానీ దాని చుట్టూ అల్లిన కథ చాలా పలచగా ఉండి, స్క్రీన్ ప్లే లో అస్సలు పట్టు లేకుండా ఉండి ఎక్కడా వినోదాన్ని అందించలేని స్థితిలో కొట్టుమిట్టాడింది. "కోర్ట్" సినిమా జంట హర్ష్ రోషన్, శ్రీదేవి కాంబినేషన్లో సినిమా అనగానే యంగ్ ఆడియన్స్ లో ఆసక్తి నెలకొంది. దానికి తోడు "తిప్పుకుంటాను.." అనే పాట వైరల్ అవ్వడంతో ఇంకాస్త అంచనాలు ఏర్పడ్డాయి. కేవలం ఈ రెండింటి మీదే ఫోకస్ పెట్టి మిగిలినదంతా గాలికొదిలేసి తీసిన చిత్రమిది. ఆర్టిస్టుల ఎంపిక కానీ, వాళ్ల చేత చేయించిన నటన కానీ, రాసుకున్న సంభాషణలు కానీ, కల్పించుకున్న సీన్స్ కానీ దేనిలోనూ స్టాండర్డ్ కనిపించలేదు.

లేచిపోయిన కూతురు వెనక్కి వస్తే ఆమె తండ్రి ఇంట్లోకి రానీయడు. దాంతో హీరోగారి తల్లైన మేనత్త ఆమెను ఇంటికి తీసుకొస్తుంది. "లేచిపోయినదాన్ని ఎందుకు తీసుకొచ్చావ్" అని హీరో తల్లిని అడిగితే, "అలా అనకురా. పిక్నిక్ కి వెళ్లిందనుకో అంతే" అంటుంది. అలాంటి తల్లులు సమాజంలో ఉంటారా? సినిమా రచన సమాజానికి అద్దం పట్టేలా ఉండాలి. అలా లేకుండా ఏదో "ప్రోగ్రెసివ్ థాట్" ని చెప్పినట్టు చూపిస్తే ఇలాంటి సినిమాల్లో అస్సలు పొసగదు. మరొక చోట బ్యాంక్ వాళ్లు ఇంటిని జప్తు చేయడానికి వచ్చిన సీన్ ఒకటి. ఆ సీరియస్ సీన్లోనే కామెడీ ఏదో చేయ్యాలనుకున్న దర్శకుడి తాపత్రయం చూస్తే జాలేస్తుంది, చిరాకు కూడా వస్తుంది. పెళ్లి అవ్వకపోయినా తల్లిదండ్రులు ఇంట్లో ఉండగానే, హీరోహీరోయిన్లు ఒకే గదిలో పడుకోవడం హైలైట్. ఒక సీన్లో హీరో తన స్నేహితుడికి తాళి కట్టడం కామెడీ పేరుతో చూపించిన ఒక చికాకుగొలిపే షాట్.

అలాగే ఎందుకో కానీ, తెలంగాణా యాసని బలవంతంగా పెట్టినట్టుంది. నిజానికి సాయికుమార్ కి, హీరోయిన్ కి ఆ యాస నేచురల్ గా లేదు.

ప్రేమ కథా చిత్రం అంటేనే చూసేవాళ్ల మనసుని కట్టిపారేయాలి. మంచి పాటలుండాలి. పైగా ఇందులో హీరో పాత్ర




మ్యూజిక్ డైరక్టర్. అలాంటప్పుడు మ్యూజికల్ గా ఎంత శ్రద్ధ పెట్టుండాలి! అస్సలు పెట్టలేదు. ఏదో రొట్ట కొట్టుడు పాటలే తప్ప మ్యూజికల్ గా నిలబెట్టే ప్రయత్నమే చెయ్యలేదు.

నటీనట వర్గానికి వస్తే హర్ష్ రోషన్ డ్యాన్సుల వరకు బానే చేసాడు. యాక్టింగులో ఎంత ఈజ్ ఉన్నా కేరక్టర్లో డెప్త్ లేనప్పుడు తేలిపోతుంది. అదే జరిగింది.శ్రీదేవి చూడడానికి అలనాటి హీరోయిన్ సుహాసిని టైపులో అనిపించింది. అయితే పెద్దగా నటనా వైదుష్యం ఉన్నట్టు మాత్రం కనిపించట్లేదు. అవే స్టాక్ ఎక్స్ప్రెషన్స్ ఎన్ని సార్లైనా! నటిగా నిలబడాలంటే ఇంకా కృషి చేయాలి. అఫ్కోర్స్ పాత్రలు, దర్శకులు కూడా ఆ స్థాయిలో పడాలి.

హీరో స్నేహితులుగా నటించవాళ్లంతా పేలవంగా ఉన్నారు. ఒక్కరిది కూడా స్క్రీన్ ప్రెజెన్స్ స్ట్రాంగ్ గా లేదు. వాళ్లకి రాసిన డైలాగ్స్ కూడా వీక్ కావడం వల్ల ఫలితం అస్సలు దక్కలేదు.

సాయికుమార్ ఓకే. హీరో తల్లి పాత్రకి కాస్త ప్రాధాన్యమున్న సీన్లు పడ్డాయి.

సాంకేతికంగా చూస్తే సంగీతం పెద్ద మైనస్. ఒక్క "తిప్పుకుంటాను.." అనే వైరల్ అయిన పాట తప్ప చెప్పుకోవడానికి ఏమీ లేవు. "రాజమ్మ ఇడిసిపోయిందిరో..." తరహా సొండిచ్చే పాటలు అరవ సినిమాల్లో లెక్కలేనన్ని వచ్చాయి. ఇలా కొత్త పాటలు చేసుకునే బదులు యూట్యూబులో హిట్టైన ప్రైవేట్ ఫోక్ సాంగ్స్ కొనుక్కుని పెట్టుకునుంటే మంచి మ్యూజికల్ అనిపించుకునేది. నేపథ్య సంగీతం కూడా అంతంతమాత్రమే. కెమెరా, ఎడిటింగ్ ల గురించి ప్రత్యేకంగా మెచ్చుకుంటూ రాయడానికి ఏమీ లేదు.కోన వెంకట్ సారథ్యంలో విడుదలైన సినిమా అనగానే కాస్తంతైనా రచనలో పరిణతి ఉంటుందనుకోవడం తప్పని ఈ చిత్రం చూసాక తేలింది. ఇంత దయనీయమైన రైటింగ్ పెట్టుకుని ఏ ధైర్యంతో తీసేసారో అర్థం కాదు. ఒక్క సీన్ కూడా పండలేదు. ఒక్క చోట కూడా మనసు ద్రవించలేదు. అసలు హీరోయిన్ ట్రాక్ మొత్తం పరమ చిరాకుపెట్టింది. చివర్లో ఇచ్చిన ట్విస్ట్.. రిలీఫ్ ఇవ్వాలసింది పోగా, ఇంకాస్త చికాకు పెంచింది. ఒక సీన్లో హీరోయిన్ ఒకడిని "పుచ్చె లేచిపోద్ది" అంటుంది. "ఏంటమ్మా.. పుచ్చె కూడా లేచిపోవడమేనా.. నీకు లేచిపోవడం తప్ప ఇంకేమీ తెలీదా" అంటాడు. అలా "లేచిపోవడం" అన్న కాన్సెప్టుతో నడుస్తున్న ఈ చిత్రాన్ని, భరించలేక కొంతమంది ప్రేక్షకులు మధ్యలోనే హాల్లోంచి లేచి పోయారు. "కోర్ట్" జంట కదా అని కొద్దిపాటి అంచనాలు పెట్టుకుని వెళ్తే నెత్తి మీద పెద్ద బ్యాండ్ వాయించింది. మానసిక పరిపక్వత, సామాజిక స్పృహ ఏ మాత్రం లేని రచన ఇది. సినిమా రైటింగ్ లోనూ, మేకింగ్ లోనూ బేసిక్ స్టాండర్డ్ కూడా పాటించని ప్రోడెక్ట్ ఇది. రెండు గంటల ఇరవై నిమిషాల సినిమా నాలుగ్గంటల సినిమాలా అనిపించింది.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

## ఏ పి ఇ డబ్ల్యూ ఐ డి సి, డైరెక్టర్ పి ఎం జె బాబు




**నవతరం-శ్రీకాకుళం**



స్వర్ణంధ్ర స్వచ్ఛభారత్ మూడవ శనివారం కార్యక్రమం సందర్భంగా ఈ రోజు రెండో డివిజన్ ఆదివారంపేట కమ్యూనిటీ హాల్ వద్ద పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, రోడ్లు పై చెత్త వేయకుండా చూడాలని కోరారు. ప్లాస్టిక్ సంచులు వాడరాదనీ , కాచి చల్లార్చిన నీరు త్రాగాలని సూచించారు. ఈ కార్యక్రమం లో రెండో డివిజన్ ఇంచార్జి రాజారావు, జగన్, సచివాలయం సిబ్బంది జ్ఞానేష్, శివాజీ, ఆర్పీలు సంతు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# "రామ నామ స్మరణే ముక్తికి సోపానం"




**నవతరం- పొందూరు**

శ్రీరామ నామ స్మరణే ముక్తికి సోపానమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పెన్నం నానాజీ సాయిరాం పేర్కొన్నారు. ఈ మండలం లయిదాం శివానంద ధర్మక్షేత్రంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా ఏర్పాటైన ఆధ్యాత్మిక సదస్సులో నానాజీ స్వామి పాల్గొని మాట్లాడారు. మూర్తీభవించిన ధర్మమే శ్రీరాముడని అన్నారు. త్యాగరాజు వంటి వాగ్గేయకారులు రామ సంబంధిత కీర్తనలతో చరితార్థులయ్యారని అన్నారు. ఈ కార్యక్రమానికి ధర్మక్షేత్రం అధ్యక్షులు గొర్రె అనంత రామకృష్ణ అధ్యక్షత వహిస్తూ రామ సంకీర్తనం జరిగిన చోట ప్రజలు సుఖశాంతులతో జీవనం సాగిస్తారన్నారు. గీతా ప్రకాశానందస్వామి, దయానందదత్తస్వామి, గీతాప్రకాశానందస్వామి, జ్యోతిస్వామి, అరుణానందస్వామి, కమలాత్మానంద స్వామి రామకథామృతాన్ని గురించి ప్రసంగించారు. సీతారామచంద్ర మహా ప్రభువుల మహాయజ్ఞం, సీతారాముల కళ్యాణం జరిగాయి. భారీ ఎత్తున అన్నసమారాధనను నిర్వహించారు. పొందూరు, జి.సిగడాం, సంతకవిటి, లావేరు తదితర మండలాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# 31వ డివిజన్ లో స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ కార్యక్రమం

**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం నగరం లోని 31 డివిజన్ లోని పలు వీధుల్లో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ ఏపీ కనీస వేతన సలహా మండలి డైరెక్టర్ విబూతి సూరిబాబు పాల్గొని స్వయంగా వీధులను ఆయన పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రత వలన ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం ఈ భృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు .నియోజకవర్గం లో ఎమ్మెల్యే గోండు శంకర్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలు దిగ్విజయంగా జరుగుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు




# ఐదు రోజుల అధ్యాపకుల శిక్షణ కార్యశాల బ్రోచర్ ఆవిష్కరణ

## డైరెక్టర్ ప్రో వివి నాగేశ్వరరావు




**నవతరం-టెక్కలి**

ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ మరియు ఐటీ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 6 నుంచి నిర్వహించనున్న ఐదు రోజుల అధ్యాపకుల ప్రత్యక్ష శిక్షణ కార్యశాల బ్రోచర్‌ను కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడ్వాన్స్‌మెంట్ ఇన్ జనరేటివ్ ఏఐ, రియల్ వరల్డ్ అప్లికేషన్స్, డీప్ జనరేటివ్ మోడల్స్, మల్టీమీడియా రంగాలకు సంబంధించిన అంశాలపై నిపుణులు శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధికి ఈ కార్యశాల దోహదపడుతు ందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతున్నదన్నారు. కన్వీనర్‌గా డా. జి. నాగేశ్వరావు, కో-కన్వీనర్‌గా డా. ఎం. జయంతి రావు వ్యవహరిస్తుండగా, కోఆర్డినేటర్లుగా ఎం. దివ్య, బి. ఉషారాణి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డీన్లు డా. డి. శ్రీరాములు, డా. బి.వి. రమణ, హెచ్ఓడీలు డా. వై. రమేష్, డా. బి. రమేష్ నాయుడు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**నవతరం-పాలకొండ**

మొక్కజొన్న పంటను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ధరల స్థిరీకరణ నిధి నుంచి నిధులు కేటాయించి మద్దతు ధర అమలు చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగగా, మద్దతు ధర క్వింటా రూ.2400 ఉండగా దళారులు రూ.1600--1700కే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

ఈ సమస్యపై మార్కెఫెడ్ జిల్లా మేనేజర్ విమల స్పందించి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.




# కథ: "గుడ్డు కాదు...! గుడ్ ఎడ్యుకేషన్"!




బండారుపల్లి లో ఉన్న ప్రభుత్వ బడి బయట నుంచి చూస్తే బహు బాగుంటుంది. కొత్త భవనం, రంగురంగుల గోడలు, మంచి మధ్యాహ్న భోజనం, పిల్లలతో కళకళలాడుతోంది.

ప్రతి రోజు ఉదయం 8:30 గంటలకు పిల్లలు ఒక్కొక్కరుగా బడికి వస్తారు. కొంతమంది చదవడానికి... ఇంకొంతమంది భోజనం కోసం...

ఆ బడిలో భరత్ 5వ తరగతి చదువుతున్నాడు. బాగా తెలివైనవాడే... కానీ ఒక సమస్య ఉంది.

ఒక రోజు ఒక అధికారి బడికి వచ్చారు.

"ఏమండి! గుడ్డు ఇస్తున్నారా? మెను ఫాలో అవుతున్నారా?" అని అడిగారు.

"అన్నీ బాగానే జరుగుతున్నాయి సార్" అని ప్రధానోపాధ్యాయుడు చెప్పారు.

ఆ అధికారి అక్కడ నిలబడిఉన్న భరత్ ను పిలిచి 2వ తరగతి తెలుగు వాచకం లో మొదటి పాఠం చదవమన్నారు.

భరత్ చేతులు వణుకుతున్నాయి. అక్షరాలు గుర్తించలేకపోతున్నాడు. చదవలేక తల దించుకున్నాడు.

పలక, బలపం ఇచ్చి పేరు వ్రాయమన్నారు.

"బరత" అని వ్రాశాడు.

అధికారి మెల్లగా అడిగారు: " బాబూ నువ్వు ఏ తరగతి?" అని.

"5వ తరగతి సార్..." అన్నాడు.

అధికారి ముఖం మారిపోయింది.

ఆ రోజు సాయంత్రం...భరత్ ఇంటికి వెళ్లి తన అమ్మను "అమ్మ... నేను బడికి ఎందుకు వెళుతున్నాను?" అని అడిగాడు.

అమ్మ ఆశ్చర్యంతో "చదువు కోసంరా!" అంది.

"అయితే... నాకు ఎందుకు చదవడం, రాయడం రావడం లేదు ?" అన్నాడు.

అమ్మ కళ్ళలో నీళ్లకు బదులు చదివించాలి అనే కసి మొదలైంది.

మరుసటి రోజు... అధికారి మళ్లీ బడికి వచ్చారు. ఈసారి ఆయన అడిగిన ప్రశ్నలు మారిపోయాయి:

"పిల్లలు చదవగలుగుతున్నారా?" "వారికి బేసిక్ స్కిల్స్ ఉన్నాయా?" "టీచింగ్ ఎలా జరుగుతోంది?"

టీచర్లలో ఆలోచన మొదలైంది.

కొన్ని రోజుల తర్వాత... బడిలో మార్పు మొదలైంది.

ప్రతి రోజు ఒక గంట "రీడింగ్ టైమ్" వారానికి ఒకసారి "బేసిక్ టెస్ట్" టీచర్లు ఒక్కో పిల్లాడిని పర్సనల్‌గా గమనించడం.

మెల్లగా... భరత్ అక్షరాలు కలిపి పలకడం నేర్చుకున్నాడు... పదాలు చదవడం మొదలెట్టాడు...

ఒక రోజు... క్లాస్ ముందు నిలబడి పాఠం కూడా చదివాడు. అందరూ చప్పట్లు కొట్టారు.

మళ్ళీ అధికారి వచ్చి భరత్ ను పిలిచి ఏదైనా చదివి వినిపించు."అన్నారు.

భరత్ ధైర్యంగా పుస్తకంలోని చివరి పాఠం చదివాడు.

ఆయన " దట్స్ గుడ్. భరత్ యు ఆర్ గ్రేట్ !" అని భుజం తట్టారు.

టీచర్లను మెచ్చుకున్నారు.

సాయంత్రం భరత్ ఇంటికి వచ్చి జరిగిన విషయం అమ్మనాన్నలకు ఆనందంగ చెప్పాడు.

బడిలో ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, అధికారుల ప్రభావం భరత్ ను బాధ్యత కలిగిన భారత పౌరుడుగ మార్చారు

కథ నీతి:

"భోజనం" పిల్లలను బడికి తీసుకువస్తుంది

"చదువు" వాళ్ల భవిష్యత్తును తీర్చిదిద్దుతుంది.

ప్రశ్నలు మారితే, పద్ధతి మారుతుంది.

బాధ్యత మొదలైతే... భవిష్యత్తు మారుతుంది

"గుడ్డు ఇచ్చారా?" అని కాదు...

"గుడ్ ఎడ్యుకేషన్ ఇస్తున్నారా?" అనేదే ముఖ్యం.

రచన : తేరాల రాజేంద్రప్రసాద్ –
మీసేవ – బాబు జగ్జీవన్ రామ్ నగర్
(గిరినగర్), హైదరాబాద్ – 37
చరవాణి:9297109223

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**